క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సారవకోట: మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ స్మారక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని శాఖా గ్రంథాలయ స్థలంలో మహాత్ముడు వచ్చి బస చేశారని ఉద్దేశంతో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు లైబ్రేరియన్ సాయమ్మ తెలిపారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు.

బోరు ఏర్పాటు



చేతి పంపు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధి బైరి వీధిలో మండల పరిషత్ నిధులతో బోరు (చేతి పంపు) నిర్మాణ పనులను సర్పంచ్ బూరల్లి శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ వీధిలో నీటి సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకులు గణగళ్ల శ్రీనివాస్ తీసుకువచ్చారు. ఎంపీపీ ఆరంగి మురళీతో సర్పంచ్ సంప్రదించి అవసరమైన నిధులు మంజూరు చేయించారు. సోమవారాని తాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణవేణి

సరుబుజ్జిలి: పచ్చదనం పరిరక్షణకు ప్రజలంతా కృషిచేయాలని ఆమదాలవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెవర కృష్ణవేణి పిలుపునిచ్చారు. ఉపాధి హామీ అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తెలికిపెంట రైతు భరోసా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, ఉపాధి హామీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్‌కు బానిసకావద్దు



మాట్లాడుతున్న రచయిత భూపతిరావు

పొందూరు: యువత ఫోన్లకు బానిస కావద్దని రచయిత, మానసిక నిపుణుడు బొడ్డేపల్లి భూపతిరావు అన్నారు. మండలంలోని మొదవలసలో గల ప్రభుత్వ పాఠశాల వద్ద యువత నేటి–సామాజిక బాధ్యత అనే అంశంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. భూపతిరావు మాట్లాడుతూ యువత తెలిసీ, తెలియని వయస్సులో చెడు వ్యసనాలు బారిన పడుతున్నారన్నారు. సినిమాలు, ఫోన్లను జీవితంగా భావిస్తూ.. అందమైన జీవితాలను ఆగాథంలోనికి నెట్టుకుంటున్నారన్నారు. సరైన జీవిత లక్ష్యం, గమ్యాన్ని యువత ఏర్పర్చుకోవాలన్నారు. ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ శ్యాముల్‌రెడ్డి, శాస్త్రవేత్త బొడ్డేపల్లి రమణ, హెచ్‌ఎం మొదలవలస పెంటన్నాయుడు, సర్పంచ్ మొదలవలస దివ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



పుస్తకాలను అందజేసిన రామరాజు

పాతపట్నం: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, ప్రతి రోజూ గ్రంథాలయానికి వెళ్లి దిన పత్రికలు, పోటీపరీక్షల పుస్తకాలను చదివితే విజ్ఞానం పెరుగుతుందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పి.రామరాజు అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామంలో ఉన్న సరస్వతి గ్రంథాలయానికి జాతీయ నాయకులు జీవిత పుస్తకాలను, వివిధ రకాల పుస్తకాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు ఉన్నాయని, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సాయి, వనిత, భాను, జ్యోతి నాయుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఔషధం



తురకపేట గ్రామంలో నిల్వ ఉన్న మురుగునీరు

- పరిసరాలు అపరిశుభ్రంగా ఉంచాలి
- ఆరోగ్యసూత్రాలు పాటించాలి

సరుబుజ్జిలి: వర్షా కాలంలో పారిశుద్ధ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఆవాసాలు పరిశుభ్రం విషయంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకొంటే చికిన్ గున్యా, డెంగీ, డయేరియా వంటి అంటు వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చునని వైద్యాధికారులు చెబుతున్నారు.

డయేరియా..
కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధులు అధికంగా డయేరియా వ్యాధి వ్యాపిస్తుంది. దీనివల్ల తరచూ నీళ్లవిరోచనాలు వస్తాయి. దీంతో నీరసం, అతిదాహం ఉంటుంది.

చికిన్‌గున్యా..
చికిన్‌గున్యా వైరస్‌లో కలిసి ఈడిస్ దోమ కుట్టడం వల్ల వ్యాధి వ్యాపిస్తుంది. దోమకుట్టిన తరువాత 3 నుంచి 12 వారాల లోపు జ్వరం వస్తుంది. తల నొప్పి, వాంతులు, వికారం, హఠాత్తుగా జ్వరం రావడం ఈ వ్యాధి లక్షణాలు. దీనివల్ల శరీరంలో అన్ని కీళ్లపై దీనిప్రభావం చూపుతుంది.

మలేరియా..
ఈ వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్న జీవివల్ల వ్యాపిస్తుంది. ఈ వ్యాధి ఆడ ఎనాఫిలిస్ దోమకుట్టడం వల్ల వ్యాపిస్తుంది. ఈ దోమలు మంచినీరు, మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఉండి వ్యాధిని తీవ్రతరం చేస్తాయి. ఈ దోమ కుట్టిన తరువాత 7 నుంచి 10 రోజుల్లో చలి, వణుకు, వంటి నొప్పిలతో కూడిన జ్వరం విడిచి వస్తుంది.

డెంగీ జ్వరం..
అన్నింటికంటే ప్రాణాంతకమైన వ్యాధి డెంగీ. టైగర్ అనబడే దోమలు పగటిపూట మాత్రమే కుడతాయి. జ్వరంతోపాటు శరీరంపై ఎర్రటిమచ్చలు, దద్దుర్లు, చిగుళ్లనుంచి రక్త వస్తుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు.....
- ఆవాసాలు ముందు చెత్త, పెంటకుప్పలు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలి.
- కొబ్బరిబొండాల చిప్పలు, పాతటైర్లు, పూలకుండీలు లేకుండా చూడాలి.
- భోజనం ముందు, మలమూత్ర విసర్జన సమయాల్లో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవాలి.
- కలుషితనీటికి, ఆహార పదార్థాలకు దూరంగా ఉంటూ వేడి పదార్థాలను తీసుకోవాలి, కాచిచల్లార్చిన నీటిని తాగాలి.

రక్త పరీక్షలు చేయించుకోవాలి



వర్షాల సీజన్ ప్రారంభమైంది. కాలం మారిన వెంటనే సీజనల్ వ్యాధులు ప్రజలను పీడిస్తాయి. ఆరోగ్య సూత్రాల విషయంలో ప్రజలు కచ్చితంగా వ్యవహరించాలి. జ్వర లక్షణాలు ఉంటే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

– యండ భవ్యశ్రీ, వైద్యాధికారి, సరుబుజ్జిలి

పారిశుద్ధ్య పనులు చేయాలి



పారిశుద్యపనులు సకాలంలో చేయక తరుచూ అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి.రహదారులపై మురుగునీరు,చెత్త నిల్వచేరడంవలన పల్లెల్లో ఇబ్బందికరంగా ఉంటున్నది. ఈగలు, దోమల మందులు పిచికారీ చేయాలి.

– గదిలి రమణమూర్తి, తురకపేట గ్రామం

స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు



స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు అవుతున్న పంచాయతీ కార్యాలయ ఆవరణ



బుక్ షాపుల్లో విక్రయానికి సిద్ధంగా మువ్వెన్నల జెండాలు

నరసన్నపేట: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణం స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు అవుతోంది. నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జెండా విష్కరణ చేపట్టనున్నారు. ఈ మేరకు సర్పంచ్ బూరల్లి శంకర్ ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ఎమ్మెల్యే సత్కరిస్తారు. ప్రతీ ఇంటిపై మువ్వెన్నల జెండా ఎగరేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడంతో జెండాలు విరివిగా అమ్మకాలు చేస్తున్నారు. స్థానిక పోస్టాఫీస్‌లో జెండా రూ.25 లకు అందుబాటులో ఉంచారు. అలాగే ఖాదీ బండారు షాపుల్లో విక్రయాలు చేవడుతున్నారు. ప్రైవేట్ బుక్ షాపుల్లోనూ జెండాలు అమ్మకంచేస్తున్నారు. ప్లాస్టిక్ జెండాలకు బదులుగా కాగితం, క్లాత్ జెండాలనే విక్రయిస్తున్నారు.

జాతీయ జెండాల పంపిణీ

సారవకోట: మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ జాతీయ జెండాలను ఆదివారం పంపిణీ చేశారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలనే ఉద్దేశంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు జాతీయ జెండాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.



జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొత్తూరులో భారీ వర్షం

కొత్తూరు: మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ వర్షంనీటితో నిండిపోయాయి. భారీ వర్షం కురవడంతో ఆదివారం వేసిన వరి నాట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలులు వీయడంతో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. వంగ, చిక్కుడు తదితర కూరగాయల పంటలకు నష్టం జరిగే ప్రమాదం ఉంది. సుమారు గంట సమయం కరిసిన భారీ వర్షానికి వాహనాలు నిలిచిపోయాయి. సాగు నీటి కాలువలు, గెడ్డలు వర్షం నీటితో నిండాయి. పలు గ్రామాల్లో వరి పంటలు నీట మునిగాయి.



కొత్తూరులో కురుస్తున్న వర్షం

ఉత్సాహంగా జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు



ఎంపిక పోటీల్లో క్రీడాకారుల జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ హ్యాండ్ బాల్ జట్టు ఎంపికలు ఉత్సాహభరితంగా సాగాయి. ఆదివారం సాయంత్రం పాత్రునివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా ఈ ఎంపికలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకరి కృష్ణ కుమార్, ఎమ్మెస్సీ శేఖర్ తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా జట్టును పంపిస్తామన్నారు. ఈ ఎంపికల కార్యక్రమంలో గౌరీశంకర్, ఈశ్వరరావు, జి.రాజశేఖర్, సతీష్‌రాయుడు, హరీష్‌రాయుడు, ఢిల్లేశ్వరరావు, డీఎస్ఏ కోచ్‌లు హాజరయ్యారు.

కుట్టు మిషన్ల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రోటరీ క్లబ్ (శ్రీకాకుళం), ధర్మాన టీవీఎస్ సంయుక్తంగా 60 మంది మహిళలకు ఎలక్ట్రికల్ కుట్టు మిషన్లు సమకూర్చాయి. వీటిని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ రోటరీ అంతర్జాతీయ సంస్థ చేపడుతున్న సేవలు ప్రశంసనీయమన్నారు. అలాగే కుట్టు మిషన్లు వితరణకు విరాళం ఇచ్చిన ధర్మాన టీవీఎస్ అధినేత ధర్మాన ధర్మారావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి అన్నెపు అనంతరావు, స్టార్ టీవీ చైర్మన్, విశ్రాంత డీజీపీ సీఎం గోపీనాథ్ రెడ్డి, సీఈఓ మహమ్మద్ మొహిద్దీన్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పైడిశెట్టి జయంతి, కోణార్క్ శ్రీను, అందవరపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, రోట రీక్లబ్ ప్రతినిధులు

గద్దర్ మృతి తీరని లోటు



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత నేతలు

కొత్తూరు: ప్రజా గాయకుడు గద్దర్ మృతి సమాజానికి తీరని లోటని బుద్ధ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి కృష్ణారావు అన్నారు. కొత్తూరులో గద్దర్ చిత్రపటానికి కృష్ణారావు, దళిత సంఘం నేత దుర్గాసి జమ్మయ్య, మాల మహానాడు కొత్తూరు మండల అధ్యక్షుడు టొంపదల తిరుపతిరావు ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గద్దర్ బడుగు, బలహీన వర్గాలను తన పాటలు ద్వారా చైతన్య పరిచారన్నారు. పేద, దళిత, బడుగుల హక్కుల కోసం ఆయన పాట ద్వారా చేసిన పోరాటాలను గుర్తుచేశారు. కారంచేడు మరణ కాండపై గద్దర్ పాడిన పాటలు ఎంతో మందిని కదిలించాయన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు బొమ్మాలి గుమ్మయ్య, మహేంద్ర, రాంబాబు, మంతిన త్రినాధరావు, వజ్రగడ్డ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ప్రసాద్

కొత్తూరు: మండలంలోని కురిగాం ఎస్సీ బాలుర వసతి గృహం మూసివేత ప్రతిపాదనను అధికారులు విరమించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ కోరారు. వసతి గృహం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం వసతి గృహం విద్యార్థులు ఆందోళన చేశారు. వసతి గృహంలో విద్యార్థులు తక్కువగా ఉండటంతోపాటు వసతి గృహం భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్న నెపంతో మూసివేసేందుకు చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. భవనాలు ఆధునికీకరణ చేసి అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నేతలు ప్రశాంత్ రాజు, రామారావు పాల్గొన్నారు.

కామరాజుకు ఉద్యోగోన్నతి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం స్టేట్ టాక్స్ ఆఫీస్‌లో జీఎస్‌టీఓగా పనిచేస్తున్న బడియా కామరాజు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. కామరాజు పాడేరుకు పదోన్నతిపై వెళ్లనున్నారు. ఆయనకు జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు కల్లేపల్లి రాంగోపాల్, కంఠ వేణు, తైక్వాండో శ్రీను, రాయి వేణుగోపాల్ అభినందనలు తెలిపారు.

యోగా పోటీలకు విశేష స్పందన



సర్టిఫికెట్లతో యోగా సాధకులు

శ్రీకాకుళం కల్చరల్: నేషనల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన యోగా పోటీలకు విశేష స్పందన వచ్చింది. పీఎన్ కాలనీలోని ఎన్‌సీఎస్ స్కూల్‌లో జిల్లా స్థాయి యోగా పోటీలు ఆదివారం నిర్వహించారు. రిథమిక్ యోగాలో వై.నళిని, పి.రంజితలకు గోల్డ్ మెడల్, ఆర్టిస్టిక్ యోగాలో జీవితకు గోల్డ్‌మెడల్, ఆర్టిస్టిక్ యోగా మరో విభాగంలో ఎం.శ్రీకాంత్‌కు గోల్డ్ మెడల్ దక్కింది. ఎం.విజయకుమార్‌కు సిల్వర్ మెడల్ వచ్చింది. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో బాలికల విభాగం, బాలుర విభాగంలో సత్తాచాటిన పలువురికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు తంగి స్వాతి, జి.శంకర్, కేదార్నాథ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

త్యాగమూర్తులను స్మరించుకోవాలి



ఎల్.ఎన్.పేట: మట్టి కుండలతో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన త్యాగమూర్తులను స్మరించుకోవాలని, దేశ ఔన్నత్యాన్ని, కీర్తిప్రతిష్ఠలను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని శ్యామలాపురం ఆర్ అండ్ ఆర్ గ్రామంలో నా మట్టి–నాదేశం కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మేరా మట్..మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మట్టి కుండలు పట్టుకుని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నా భూమి.. నా దేశం
సరుబుజ్జిలి: దేశ ఔన్యత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందని పురుషోత్తపురం పంచాయతీ ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పురుషోత్తపురంలో ఆదివారం నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మట్టి పట్టుకుని ప్రతిజ్ఞ చేస్తున్న నర్సింహప్పారావు, గ్రామస్తులు

పర్తి యాత్ర విజయవంతం చేయాలి

ఎల్.ఎన్.పేట: పుట్టపర్తిలో జరగనున్న 20వ పర్తి యాత్ర విజయవంతం చేయాలని సత్యసాయి భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణరావు అన్నారు. మండలంలోని శ్యామలాపురంలో ఉన్న సత్యసాయి సేవా సమితి మందిరంలో పర్తియాత్ర సందర్భంగా నామసంకీర్తనలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ పర్తి యాత్రను జిల్లాలోని అన్ని సేవా సంఘాలు, సమితులు, భజన మండలి, మందిరాల సంఘాలు, కళాకండాలు బయలుదేరి విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు ఆధ్యాత్మిక భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కోఆర్డినేటర్ టి.దుర్గారావు, బాల వికాస్ ఎల్.శైలజ, ఎ.సుదీష్ణ, జగదీశ్వరరావు, మండలి సభ్యులు పాల్గొన్నారు.



భజన చేస్తున్న భక్తులు

‘అవధానం’ భాషాభిమానులకు
వీనుల విందు



శతావధాని పద్మాకర్‌ను సత్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- సంపూర్ణ శతావధాన ప్రక్రియ ముగింపు కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం కల్చరల్: భాషాభిమానులకు, సాహితీ ప్రియులకు అవధాన వేదిక వీనులవిందు కలిగించిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో మూడురోజులుగా సుమిత్రా కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సంపూర్ణ శతావధాన ప్రక్రియ ముగింపు కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. ఈ వేదికను సుమిత్రా కళా సమితివారు అవధాన వేదికగా మార్చారన్నారు. ఎంతో గొప్ప వ్యక్తులను జిల్లాకు తీసుకువచ్చి కార్యక్రమాలు భారీ ఎత్తున చేయడం అభినందనీయమన్నారు. ముందుగా డాక్టర్ పిలకా శాంతమ్మ రచించిన ‘ఇతిహాస వనితా స్వగతం’ పుస్తకాన్ని మంత్రి, అతిథులు ఆవిష్కరించారు. ప్రముఖ అవధాని వద్దిపర్తి పద్మాకర్ శతావిధాన పద్యధారణ చేసి మెప్పించారు. ఈ సందర్భంగా పద్మాకర్‌ను నిర్వాహకుల తరపున మంత్రి ధర్మాన సత్కరించారు. అవధానులు, ప్రాశ్నికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఈశ్వరరావు, పైడిశెట్టి జయంతి, సమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, అవధానులు బులుసు అపర్ణ, ఆముదాల మురళి, దత్తాత్రేయ శర్మ, ఎ.గోపాలరావు, సువర్ణవర్మ, డాక్టర్ కె.సోమేశ్వరరావు, కిల్లాన ఫల్గుణరావు, మండవిల్లి రవి, నక్క శంకరరావు, కొంక్యాన మురళి, డి.పార్థసారధి, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు